
తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక
సెప్టెంబరు 2020

సప్తగిరి అనుబంధం



ఇందరికీ అభయంబులిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి



జగడపు చనువుల జాజర...
సగినల మంచపు జాజర...

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01 సెప్టెంబరు 2020 సంచిక: 07

## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | శ్రీమలయప్పస్వామి<br>– శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖరరావు | 04 |
| పన్నిద్దరాళ్వార్లు | పెరియాళ్వార్<br>– ఆచార్య కె.సర్వోత్తమరావు | 06 |
| కన్నడహరిదాసవరేణ్యులు | శ్రీవిజయదాసులు<br>– శ్రీ దేసువెంకటసుబ్బారావు | 08 |
| చిత్రకథ | తుంబురుతీర్థం<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: పేరూరు శివప్రసాద్ | 10 |
| బాలనీతి | దురాశ దుఃఖానికి చేటు<br>– శ్రీ ఎ.ఎన్. జగన్నాథశర్మ | 14 |
| విశిష్టబాలుడు | | 16 |
| క్విజ్ | నిర్వహణ: డా॥ కంపల్లె రవిచంద్రన్ | 17 |
| చిత్రలేఖనం | | 18 |


ముఖచిత్రం : శ్రీవేంకటేశ్వరుడు
వెనుక చిత్రం : అన్నమయ్య - శ్రీవారు

హిందూ దేవుళ్లు

# శ్రీమలయప్పస్వామి

- శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖరరావు

తిరుమలక్షేత్రం.. ఆశ్వయుజమాసం... బ్రహ్మోత్సవాలు జరుగుతూ ఉన్నాయి. సాయంత్రం ఏడుగంటలు.. చీకట్లు అలుముకున్నాయి. తిరుమల మాఢవీథులలో నూనెదీపాలు మినుకుమినుకుమంటూ నక్షత్రాల్లా వెలుగుతూ ఉన్నాయి.

కొండంతా భక్తజనంతో నిండిపోయింది. మాడవీథుల్లో ఇసుక వేస్తే రాలనంతజనం.. 'గోవింద... గోవింద... గోవింద...' అంటూ భక్తుల నామస్మరణలతో కొండంతా మారుమ్రోగుతూ ఉంది. బ్రహ్మరథం తూర్పు మాడవీథి దాటి, దక్షిణమాఢవీథిలో ముందుకు సాగుతోంది.

ఆనందనిలయంనుంచి వాహనాన్ని అధిరోహించి, దివ్యమనోహర రూపంతో శ్రీవేంకటేశ్వరుడి ఉత్సవమూర్తి అయిన శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి వెలుపలకు వచ్చి హారతులందుకుంటూ... భక్తుల నామస్మరణలను ఆలకిస్తూ... వారిపై కరుణాకటాక్షాలను ప్రసరింపజేస్తూ ముందుకు సాగుతూ ఉన్నాడు. గోవిందనామాలు స్మరిస్తూ.. స్వామిని దర్శిస్తూ భక్తులు పులకిస్తూ ఉన్నారు. స్వామివారి ఊరేగింపు ముందుకు సాగుతోంది..

జనంలో అలికిడి ప్రారంభమైంది. అదుగో 'అక్కడ పొగవస్తోంది. మంటలుకూడా వస్తూ ఉన్నాయి' అనుకుంటూ స్వామివారిని దర్శించాలని, దర్శిస్తూ ఉన్నభక్తులు ఒక్కసారిగా ఉత్తరమాఢవీథివైపు చూడసాగారు.

రానురాను మంటలు అన్నివైపులకు విస్తరించాయి. అగ్నికి గాలి తోడైంది. మంటలు అధికం కాసాగాయి.... తిరుమలలోని నివాస గృహాలన్నీ అగ్నికి ఆహుతికాసాగాయి. అందరూ భయంతో వణికిపోయారు. 'ఏడుకొండలవాడా! వేంకటరమణ... ఏమిటీ వైపరీత్యం... రక్షించు స్వామీ!" అర్చకులతో పాటు అధికారులు, భక్తులు స్వామివారిని ప్రార్థించసాగారు...




అంతలో... జనంలో నుంచి ఒక వ్యక్తి ఉత్సవం ముందు వచ్చి, ఏదో ఆవహించినట్లుగా గంభీరంగా నిల్చుని–"ఇక మీదట ఉగ్ర శ్రీనివాసమూర్తిని ఊరేగిస్తే స్వామివారికి ఉగ్రత్వం వచ్చి ఇలాంటి సంఘటనలే జరుగుతాయి.. దగ్గరలోని మలయప్పకోనలో నా విగ్రహాలు ఉన్నాయి. తెచ్చి ఉత్సవాల్లో వినియోగించండి" అని గట్టిగా అరచి, ఉన్నట్లుండి అక్కడ నుంచి నిష్క్రమించాడు.

"ఎవరావ్యక్తి? ఎటుకెళ్లాడు?" అని అందరూ చూడసాగారు అయితే జనంలో కలిసి ఎవరు తెలుసుకోలేకుండానే కనిపించకుండా పోయాడు.

"స్వామే! మాకు మార్గం చూపించారు..." అని అందరూ నమస్కరించుకుని స్వామికి కృతజ్ఞతలు చెప్పుకోసాగారు.

మంటలు క్రమంగా సన్నగిల్లాయి.

ఆ మరునాడు– అర్చకులు మలయప్పకోనకు వెళ్లి, వెతకగా శ్రీదేవి, భూదేవిసమేతస్వామివారు దర్శనమిచ్చారు. తీసుకుని వచ్చి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. ఉత్సవాల్లో ఉపయోగించసాగారు. నిత్యఉత్సవాల్లో పాల్గొని, సేవలందుకునే ఆ స్వామే..

– శ్రీమలయప్పస్వామి!



# పెరియాళ్వార్

- ఆచార్య కె.సర్వోత్తమరావు

శ్రీవైష్ణవులకు పరమపవిత్రగ్రంథం 'నాలాయిరం'. ఈ నాలాయిరాన్ని 'దివ్యప్రబంధం'గా వైష్ణవగోష్ఠి కీర్తిస్తుంది. ఈ దివ్యప్రబంధం ఎక్కడి గానం చేసినా 'పల్లాండు పల్లాండు'తో మొదలుపెట్టడం సంప్రదాయం. 'పల్లాండు' పాడినవారు విష్ణుచిత్తులు. వీరు శ్రీవిల్లిపుత్తూరు వాసి.

అక్కడి వటపత్రశాయి ఆనతో మధురలో జరిగే పరతత్త్వనిర్ణయ వాదసభలో పాల్గొని శ్రీహరి ఔన్నత్యాన్ని చాటినవారు. విష్ణుచిత్తులవాదం సరి అనడానికి సాక్ష్యంగా సభలో పైన కట్టబడిన శుల్కం ముల్లె జారి పడడం విశేషం. మధురాధిపతి విష్ణుచిత్తులవారిని ఏనుగుపై అధిరోహణం చేసి గౌరవించాడు. ఈ సంబరాన్ని చూడడానికి విష్ణువు గరుడారూఢుడై ఆకాశంలో ప్రత్యక్షమైనాడు.



ఈ దివ్యదృశ్యాన్ని తిలకించిన విష్ణుచిత్తుడు స్వామికి రక్షగా ఏనుగుకు కట్టిన ఘంటికలనే తాళాలుగా వాయిస్తూ పాడిన పాశురాలే 'పల్లాండు'. ఈ గౌరవం కారణం ఆళ్వారులలో విష్ణుచిత్తుడు పెరియాళ్వారు (పెద్దఆళ్వార్) అయ్యాడు.

మాలాకైంకర్యమే తన విధిగా భావించి సేవించినవారు- విష్ణుచిత్తులు. ఆ పరమభాగవతులకు పూలతోటలో ఒక శిశువు కనిపించింది. విష్ణుచిత్తులవారు దేవతానుగ్రహంగా ఆ శిశువును ఇంటికి తీసి కెళ్లి లాలన పోషణ చేశారు. ఆ శిశువే 'కోదై', గోదాగా ప్రసిద్ధురాలు.

'గోద' బాల్యంనుండి పరమ భక్తురాలు. తండ్రిద్వారా 108 దివ్యదేశాల వృత్తాంతాలను విని, శ్రీరంగనాథుణ్ణి మనసా వరించింది.



విష్ణుచిత్తులవారు అనుదినం పూలతో చిత్ర విచిత్రంగా మాలలు కట్టి, వట పత్రశాయికి సమర్పించేవారు.

ఒకరోజు 'గోద' ఆ మాలలలో ఒక మాలను తన మెడలో అలంకారంగా వేసు కుంది. దగ్గరిబావిలో తన ప్రతి బింబాల్ని చూచి, మురిసిపోయింది. మరల యథాప్రకారంగా ఆ మాలను పూలబుట్టలో పెట్టేసింది.

ఈ తతంగం విష్ణుచిత్తులవారికి తెలియదు. ఒకరోజు పూల తట్టలోని ఒక హారంలో ఒక 'శిరోజం' కనబడగానే ఏదో అపచారం జరి గిందని భావించారు. ఆ వేళ స్వామికి పూజాకైంకర్యం సాగలేదు. కాని, స్వామి గోద ధరించిన ఆ పూమాల తనకిష్టమనడంతో విష్ణుచిత్తులవారు ఆశ్చర్యపడ్డారు.

గోదాదేవి సదా శ్రీరంగధ్యాసతో గడపడాన్ని విష్ణుచిత్తులవారు గుర్తించారు. క్షేత్రాధిదేవత ఆదేశంతో విష్ణుచిత్తులవారు గోదాదేవితో శ్రీరంగం చేరుకున్నారు. గోదాదేవిని తన దేవేరిగా స్వామి ఏలుకున్నాడు.

శ్రీరంగనాథస్వామికి తన కూతురి నిచ్చి మామగారనే గొప్ప గౌరవం లభించడంవల్లకూడా విష్ణుచిత్తులకు పెరియాళ్వారు అనే పేరు సార్థకమైయింది.

కన్నడ హరిదాస వరేణ్యులు

# శ్రీవిజయదాసులు

- శ్రీ దేసువెంకటసుబ్బారావు

శ్రీవిజయదాసులు శ్రీపురందరదాసులవారిశిష్యులు. హరి మదిని, హరిభక్తుల మదిని ఎలా గెలువ వచ్చో తెలిసిన వ్యక్తి అందుకే వీరిని విజయదాసులు అని అన్నారు.

వీరు రాయచూరు జిల్లాలోని మాన్వి తాలూకలోని చీకలపర్వి అనే ప్రాంతంలో పేద బ్రాహ్మణుల ఇంట జన్మించారు. వీరి తల్లిదండ్రులు శ్రీనివాసప్ప మరియు కూసమ్మ. చిన్నతనంలోనే వీరు వారణాశి వెళ్లి 4 సంవత్సరాలు విద్యాభ్యాసం చేసి తిరిగి రాయచూరు చేరుకున్నారు. వీరికి 16వ యేట ఆరళమ్మ అనే యువతితో పెళ్లయింది. పేదరికంవల్ల అనేకకష్టాలు అనుభవించారు. తన తల్లిదండ్రుల మరణానంతరం తిరిగి వారణాశికి వెళ్లి చదువు కొనసాగించి, గొప్ప సంస్కృతపండితుడయ్యాడు.

ఒకనాడు కలలో శ్రీపురందరదాసులు కనిపించి తనను హరి దాసునిగా మార్చారని, అప్పటినుండి తాను విజయదాసులుగా పేరు మార్చుకున్నానని తెలియచేశాడు. వీరి కీర్తనలు అన్నీ "విజయవిఠల" అనే అంకితనామంతో ఉంటాయి.

వీరి కీర్తనలన్నీ సుళాదులుగా ప్రసిద్ధిచెందాయి. వీరు 25,000 సుళాదులు రచించారు. పురందరదాసులవారిరచనలతర్వాత అంతటి ప్రాచుర్యం కలవి- వీరిరచనలు. వీరికి అనేకమందిశిష్యులు ఉన్నారు. వీరి అపారమైన హరిభక్తికి "దాసశ్రేష్ఠ" అనే పేరుతో గౌరవించారు. వీరు తమ జీవితకాలంలో అనేకఅద్భుతాలు ప్రదర్శించారు.

ఒకనాడు ఒక స్త్రీ తనబిడ్డతో ఆత్మహత్య చేసుకోబోగా రక్షించి చేరదీసారు. తర్వాత ఆ బిడ్డడే మోహనదాసుగా పేరుగాంచాడు. తరువాత తన సొంతకుమారుడికి రెండుసార్లు ప్రాణగండం రాగా కాపాడారు.

ఒకసారి కాశికి వెళ్లి అక్కడ గంగా నదిలో మునిగి తనవస్త్రాలు ఏమాత్రం తడవకుండా గంగానదిలో పద్మాసనం వేసుకుని ధ్యానం చేస్తూ అక్కడ వారిని ఆశ్చర్యపరచాడు.



వీరి అశేషప్రజ్ఞాపాటవాలకు ముగ్ధులైన అనేకమంది వీరికి శిష్యులు అయ్యారు. వీరి శిష్యులలో శ్రీజగన్నాథదాసులు, శ్రీగోపాలదాసులు కల్లూరు సుబ్రహ్మణ్యాచార్యులు ముఖ్యులు.

ప్రతి కార్తికశుద్ధనవమినాడు, దశమి ఉత్థానద్వాదశినాడు గుంతకల్లుకు 3 కి.మీ. దూరంలోని చిప్పగిరి వద్ద శ్రీవిజయదాసుల ఆరాధనోత్సవాలు జరుగుతాయి. వేలాదిగా భక్తులు వచ్చి, ఈ ఉత్సవంలో పాల్గొని తమ భక్తిప్రపత్తులను తెలియచేసుకుంటారు.

వీరి మరొకశిష్యులైన శ్రీగోపాలదాసులు విజయదాసులవారి బృందావనానికి ముందు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ బృందావనానికి ముందు ఒక కోనేరు ఉంది. శ్రీవిజయదాసులవారు కాశీయాత్ర చేసినప్పుడు తనవెంట గంగాజలాన్ని తీసుకొని వచ్చి కోనేరులో కలిపారు. అందువల్ల ఈ తీర్థానికి విజయతీర్థమని, గంగాజలానికున్న పవిత్రత ఈ కోనేరుకు ఉందని అంటారు.

కన్నడ, సంస్కృతాలలో ప్రావీణ్యులైన శ్రీవిజయదాసులు అనేక కీర్తనలలో శ్రీహరిని కీర్తించి, ప్రముఖహరిదాసులలో ఒకరుగా గుర్తింపు పొందారు.

చిత్ర కథ

# తుంబురుతీర్థం

కథ - డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు - పేరూరు శివప్రసాద్




నువ్వు అనుకున్నా అనుకోకపోయినా అది తప్పు ...అకృత్యం !
మన్నించు మిత్రమా !
ఇంకెప్పుడూ చెయ్యను !
నువ్వు మన్నింపుకి తగవు ! శిక్షని అనుభవించాల్సిందే
నేటి నుండి నీకు ఆకాశగమనశక్తి నశిస్తుంది. తలకిందులుగా భూమి మీద పడు... అక్కడే ఉండు ! ఇదే నా శాపం !
దేవర్షీ ! నారదా ! మన్నించు...
వెంటనే శ్రీహరి గానపుణ్యఫలం చేత తుంబురుడు శ్రీ వేంకటాచలం మీద ఘోణతీర్థం దగ్గరపడ్డాడు. అక్కడ మునివరులతో తుంబురుడు....
ఇది శ్రీవేంకటాచలం శ్రీహరి నిత్యనివాసం
మునులకు జరిగిందంతా చెప్పాడు తుంబురుడు.
పూజ్యులారా! నేను ఎక్కడున్నాను ?
ఇక్కడపడటం నీ పూర్వ పుణ్యఫలమే
మునులారా ! నాకు కర్తవ్యాన్ని బోధించండి


అవును మీరన్నది యథార్ధమే !
గంధర్వా ! ఎదురుగా ఉన్న ఈ ఘోణతీర్థం లో నిత్యమూ స్నానం చేసి, కఠోరదీక్షతో శ్రీవేంకటేశ్వరుని గూర్చి తపస్సు చెయ్యి !
తపస్సు ఎంతకాలం చెయ్యమంటారు ?
ఒక సంవత్సకాలం పాటు ఈ తీర్థం ఒడ్డునే చెయ్యి. స్వామి తప్పక కరుణిస్తాడు!
పాపపరిహారం కోసం మీరు చెప్పినట్లే చేస్తాను. కృతజ్ఞుణ్ణి !

తుంబురుని కఠోరతపస్సుకు మెచ్చి, శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు ఆయనను కీర్తిస్తూ తుంబురుడు మధురగానం చేశాడు.




వచ్చే సంచికలో...

శ్రీవేంకటేశ్వరుని మరో దివ్యలీలావిలాసాన్ని దర్శించి...తరిద్దాం! స్వస్తి!




# దురాశ దుఃఖానికి చేటు

- శ్రీ ఎ.ఎన్. జగన్నాథశర్మ

అనగనగా ఒక ఊరు. దానిపేరు కల్యాణకటకం. ఆ ఊరిలో ఓ వేటగాడు ఉండేవాడు. అతనిపేరు భైరవుడు. అతను ఓ రోజు, అడవికి వేటకు వెళ్లాడు. అక్కడ ఓ చిన్నగుంత తవ్వి, అందులో నక్కి కూర్చున్నాడు. అటుగా వచ్చే జంతువులకు ఎరగా మాంసంముక్కలు వెదజల్లాడు. వాటికి ఆశపడి, అటుగా ఓ జింక వచ్చింది. అది రావడమే ఆలస్యం, భైరవుడు దాన్ని చంపి, ఇంటిదారిపట్టాడు.

తోవలో అడవిపంది కనిపించిందతనికి. దాంతో ఈ రోజు నా అదృష్టమే అదృష్టం అనుకున్నాడు- భైరవుడు. భుజాలమీది జింకను కిందికి దించాడు. పందికి బాణం గురిపెట్టి వదిలాడు. బాణం పందికి తగిలింది. అయితే అది చచ్చిపోలేదు.

గాయపడి, కోపంతో భైరవుడిమీద దాడి చేసింది. పందీ-భైరవుడూ పోట్లాడుకున్నారు. ఆ పోట్లాటలో భైరవుడిప్రాణాలు పోయాయి. తర్వాత పందికూడా చచ్చిపోయింది. భైరవుడూ-పందిపోట్లాటలో వారి మధ్య ఓ పాముకూడా నలిగినలిగి పచ్చడయిపోయింది.

కాస్సేపటికి దీర్ఘారావం అనే నక్క అటుగా వచ్చింది. అక్కడ చచ్చిపడి ఉన్న జింక, పంది, పాము, మనిషిని చూచి, నాలిక చప్ప రించింది. చాలా రోజుల దాకా తిండికి వెతుక్కోనవసరం లేదనుకుంది.

మనిషి మాంసం నెలరోజుల దాకా సరిపోతుంది. పంది-జింకల మాంసంతో రెన్నెళ్లు గడిచిపోతాయి. పాము ఓ రోజుకి సరిపోతుందని

లెక్కలుగట్టి ఆనందించింది. పడి ఉన్న విల్లును చూచిందప్పుడు. దాని తాడును నాకి చూచింది. జంతునరంతో చేసిన తాడు అని తేల్చుకుంది. ముందు ఈ నరాన్ని తిని, ఈ రోజు సరిపెట్టుకుంటాను. తర్వాత జింక, పంది, పాము వాటన్నిటినీ తినవచ్చుననుకుంది.



విల్లుతాడును మరోసారి నాకి, తినేందుకు దాన్ని కొరికింది – నక్క. అంతే! తాడు తెగింది. విల్లు విచ్చుకుంది. ఆ విచ్చుకోవడంలో నక్కకు చెప్పలేనంత దెబ్బ తగిలింది. దాంతో నక్క చచ్చిపోయింది.

"దురాశ దుఃఖానికి చేటంటే ఇదే! దురాశ కారణంగానే నక్క చావును కొని తెచ్చుకుంది. అందుకే అంటారు, ఉన్నది అనుభవించాలి, లేదంటే ఇతరులకి ఇవ్వాలి. రెండూ చేయక చచ్చి సాధించేదేముంది?"

మితిమీరిన ఆశలవల్ల దుఃఖమే కాని, ఆనందం లేదు. దీన్ని గ్రహించాలి మనం.

# విశిష్టబాలుడు



**పేరు** - జె.శ్రీచరణ్
**తరగతి** - 4వ తరగతి
**పుట్టిన తేది** - 17-09-2011
**తల్లిదండ్రులు** - శ్రీమతి రమ్య, శ్రీజనార్ధనన్
**పాఠశాల పేరు** - మోడరన్ హయ్యర్‌సెకండరీస్కూల్, నంగనల్లూరు, చెన్నై
**అభినివేశరంగం** - శాస్త్రీయ సంగీతం, గాత్రం
**సాధించిన విజయాలు** -

01) శ్రీహయగ్రీవ కల్చరల్ అకాడమి, కాట్టుపాకంవారు నిర్వహించిన శాస్త్రీయసంగీతపోటీలలో గాత్రసంగీతంలో ప్రథమబహుమతి.

02) శ్రీహయగ్రీవ కల్చరల్ అకాడమి, కాట్టుపాకంవారు నిర్వహించిన తమిళ శాస్త్రీయసంగీతపోటీలలో తమిళవిభాగంలో తృతీయబహుమతి.

03) ఏ.డి.హ్యాడ్ క్రాఫ్ట్స్ క్వారంటైన్ సూపర్‌హీరోస్‌లో భక్తిగీతాల పోటీలలో ప్రథమబహుమతి.

04) అడంబాకం రోటరీ క్లబ్‌వారి శ్లోకపఠనం (శ్రీవేంకటేశప్రపత్తి) పోటీలలో ప్రథమబహుమతి.

05) లోటస్‌సోషల్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్టు, చెన్నై, పర్పుల్‌వింగ్స్ అకాడమీ వారు స్వాతంత్ర్యదినోత్సవసందర్భంగా నిర్వహించిన దేశభక్తిగీతాల పోటీలలో ప్రథమబహుమతి, ద్వితీయబహుమతి.

06) ఆర్ట్ డ్రీమ్స్ ఎక్స్‌ప్రెస్ స్టూడియో, చెన్నైవారు నిర్వహించిన శాస్త్రీయభక్తి గీతాలపోటీలలో ప్రథమబహుమతి.

07) ఆల్ఫాడాన్స్ స్టూడియో, నందనంవారు నిర్వహించిన భజనగీతాల పోటీ లలో ద్వితీయబహుమతి.

08) డాల్ఫిన్ అకాడమీ, చెన్నైవారు నిర్వహించిన భగవద్గీత శ్లోకపఠన పోటీ లలో ఉత్తమప్రదర్శన బహుమానం.

09) ఎక్స్‌క్టిస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటడ్, చెన్నైవారు ఈ బాలమేధావికి శాస్త్రీయ సంగీతంలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు 'స్టన్నింగ్ వోకలిస్ట్ అవార్డు' ఇచ్చి గౌరవించారు.

# క్విజ్

**నిర్వహణ- డా॥ కంపల్లె రవిచంద్రన్**

**1) సీతాదేవికి ఆడపడుచు?**

అ) కౌసల్య　　ఆ) సుమిత్ర
ఇ) అహల్య　　ఈ) శాంత

**2) శ్రీరాముని జన్మనక్షత్రం?**

అ) పునర్వసు　　ఆ) భరణి
ఇ) శతభిష　　ఈ) శ్రవణ

**3) ఊర్మిళాదేవి తండ్రి?**

అ) దశరథుడు　　ఆ) జనకుడు
ఇ) పరశురాముడు　　ఈ) కుశధ్వజుడు

**4) సుగ్రీవుడి భార్య?**

అ) తార　　ఆ) మండోదరి
ఇ) రుమ　　ఈ) అహల్య

**5) గౌతమమహర్షి భార్య?**

అ) తార　　ఆ) మండోదరి
ఇ) రుమ　　ఈ) అహల్య

**6) రావణుడి భార్య?**

అ) తార　　ఆ) మండోదరి
ఇ) రుమ　　ఈ) అహల్య

**7) వాలి భార్య?**

అ) తార　　ఆ) మండోదరి
ఇ) రుమ　　ఈ) అహల్య


---

**జవాబులు**

1) ఈ 2) అ 3) ఈ 4) ఇ 5) ఈ 6) ఆ 7) అ

# చిత్ర లేఖనం

ఈ బొమ్మకు
రంగులు వేద్దామా...



పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...



తందనాన అహి - తందనాన పురె
తందనాన భళా - తందనాన..

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-08-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742,
Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020



వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ...